క్లుప్తంగా

జగనన్న కాలనీల్లో నీటి సమస్య లేకుండా చర్యలు



జగనన్న కాలనీలో వేసిన బోరును పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ కృష్ణారావు

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని జగనన్న కాలనీల్లో నీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టామని మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు తెలిపారు. మంగళవారం మండలంలోని కంచరాం టిడ్కో కాలనీ సమీపంలో నిర్మిస్తున్న జగనన్న లే అవుట్‌ను పరిశీలించిన ఆయన నిర్మాణాలకు నీటి సమస్య లేకుండా పది బోర్లు తీయించామని, త్వరలో వీటికి హెడ్‌లు బిగించి పూర్తి స్థాయిలో నీరు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట ఈఈ దక్షిణామూర్తి, ఏఈ రత్నాకర్ ఉన్నారు.

సైకిళ్ల వితరణ



విద్యార్థినులకు సైకిళ్లు అందజేస్తున్న ప్రధానోపాధ్యాయుడు భాస్కరరావు

రామభద్రపురం: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సాలూరు కోటరం క్లబ్ అధ్యక్షుడు అన్నమరాజు గుప్తా మండలంలోని కొట్టక్కి జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఇద్దరు నిరుపేద విద్యార్థినులకు సైకిళ్లు వితరణ చేశారు. మంగళవారం వీటిని ప్రధానోపాధ్యాయుడు రావాడ భాస్కరరావు చేతులమీదుగా విద్యార్థినులకు అందజేశారు.

వసతిగృహాల్లో ఆకస్మిక తనిఖీలు



కలువరాయిలో విద్యార్థులకు పెట్టిన అల్పాహారం రుచి చూస్తున్న ఏబీసీడబ్ల్యూఓ శ్యామలాదేవి

బొబ్బిలి రూరల్: మండలంలోని కలువరాయి, పిరిడి ప్రాంతాల్లోని విద్యార్థుల వసతి గృహాల్లో వెనకబడిన తరగతుల సహాయ సంక్షేమ అధికారి(ఏబీసీడబ్ల్యూఓ) వై.శ్యామలాదేవి మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం దగ్గర నుంచి ఉపాధ్యాయుల విద్యాబోధన, విద్యార్థుల విద్యా సామర్థ్యాలపై ఆరాతీశారు. పిల్లలకు నాణ్యమైన విద్యతో పాటు నాణ్యమైన పౌష్టికాహారం కూడా అందజేయాలని సూచించారు.

సంచార పశు ఆరోగ్య సేవలు సద్వినియోగం చేసుకోవాలి



సంచార పశు ఆరోగ్య సేవల వాహనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

తెర్లాం: సంచార పశు ఆరోగ్య సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ, మండల పశువైద్యాధికారి జె.నరేంద్రకుమార్, తెర్లాం పశువైద్య కేంద్రం ఏడీ నాగరాజు కోరారు. మంగళవారం మండలానికి కేటాయించిన సంచార పశు ఆరోగ్య వాహనాన్ని పరిశీలించిన వారు పశువులకు ఎటువంటి వ్యాధులు సోకినా, అనారోగ్య సమస్యలు తలెత్తినా వెంటనే 1962 నంబర్‌కు ఫోన్ చేసి, వాహన సేవలు వినియోగించుకోవాలని తెలిపారు.

ఘనంగా అష్టోత్తర శత కలశాభిషేకం



కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

మెంటాడ: మండల కేంద్రంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరాలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా అష్టోత్తర శత కలశాభిషేకం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో ఆలయానికి అధిక సంఖ్యలో చేరుకున్న భక్తులు స్వామి వారికి కలశాలలతో అభిషేకం చేశారు.

నవధాన్యాల సాగుపై అవగాహన

తెర్లాం: నవధాన్యాలు సాగు చేస్తే రైతులకు ఎంతో మేలు జరుగుతుందని ప్రకృతి వ్యవసాయం పూనువలస క్లస్టర్ మండల యాంకర్ ఆర్నిపల్లి సింహాద్రినాయుడు తెలిపారు. మండలంలోని నందిగాం గ్రామంలో నవధాన్యాల సాగుపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులంతా తమ పొలాల్లో పచ్చిరొట్ట విత్తనాల సాగుతో పాటు 18 నుంచి 30 రకాల విత్తనాలు జల్లుకోవచ్చన్నారు. దీంతో నేల సారవంతం కావడమే కాకుండా ఆరోగ్యవంతమైన పంట, పంట దిగుబడి బాగా వస్తుందన్నారు.

ముమ్మరంగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



బొబ్బిలి రూరల్: కోమటపల్లి జ్యోతిరావ్ పూలే పాఠశాలలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు



రాజాం: ప్రశాంతినగర్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

వైఎస్సార్ సీపీ బలపరిచిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా పార్టీ నేతల ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. మంగళవారం ఓటర్ల ఇంటింటికీ వెళ్లి, మొదటి ప్రాధాన్యతా ఓటు సుధాకర్‌కే వేసి, భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. మరికొంతమంది వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తూ, కరపత్రాలు పంపిణీ చేస్తూ పార్టీ మద్దతు అభ్యర్థుల గెలుపు కోసం విశేషంగా కృషి చేస్తున్నారు. విశాఖ రాజధాని కావాలన్న ఉత్తరాంధ్రుల బలమైన ఆకాంక్షను ఆయన గెలుపు ద్వారా చాటాలని పిలుపునిస్తున్నారు. ఈ నెల 13వ తేదీన జరిగే పోలింగ్‌లో పాల్గొని, ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

–సాక్షి నెట్‌వర్క్

సీతంరాజును అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

- పీఓసీల సమావేశంలో ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా వైఎస్సార్ సీపీ బలపరిచిన సీతంరాజు సుధాకర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ కోరారు. స్థానిక పట్టణంలోని పార్టీ కార్యాలయంలో రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాలకు చెందిన పీఓసీ(పాయింట్ ఆఫ్ కాంటాక్ట్స్)లతో మంగళవారం సమావేశమైన వారు ఈ నెల 13న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా దిశానిర్దేశం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి, ప్రతీ మండలం నుంచి 20 మంది వరకు పీఓసీల ఎంపిక జరిగిందని, వీరంతా వారి ప్రాంతాల్లోని ఓటర్లకు ఓటు వేసే విధానంపై అవగాహన కల్పించాలన్నారు. ఓటర్ల ఇంటికి వెళ్లి, ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం వివరించి, పార్టీ మద్దతు ఇస్తున్న అభ్యర్థులకే వారి ఓటు పడేలా చూడాలన్నారు. సీతంరాజు గెలుపుతో ఉత్తరాంధ్రుల విశాఖ రాజధాని కావాలన్న ఆకాంక్షను బలంగా చాటాలన్నారు. అనంతరం ఓటువేసే విధానంపై పీఓసీలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఎస్.జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ ఎన్నికల పర్యవేక్షకులు శివసుబ్రహ్మణ్యం శ్రీనివాసరావు, రాజాం వైఎస్సార్ సీపీ కన్వీనర్లు పి.శ్రీనివాసరావు, ఎల్.రాజగోపాలంనాయుడు, పి.లక్ష్మణరావు, జెడ్పీటీసీ బి.నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వైఎస్సార్ సీపీ నేత మృతి



అప్పలస్వామినాయుడు భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

తెర్లాం: అనారోగ్యంతో వైఎస్సార్ సీపీ సీనియర్ నేత, మాజీ ఎంపీటీసీ బూరి అప్పలస్వామినాయుడు సోమవారం రాత్రి మరణించారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు మృతుని గ్రామమైన మండలంలోని విజయరాంపురానికి మంగళవారం వెళ్లి, అప్పలస్వామినాయుడు భౌతికకాయానికి నివాళులర్పించారు. అనంతరం మృతుని కుమారుడు సర్పంచ్ మధుసూదనరావును, బాధిత కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. పార్టీ పరంగా అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ఎస్.బాబ్జీరావు, వైస్ ఎంపీపీ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

ఆర్‌డీఓ పరిశీలన



పోలింగ్ కేంద్రం పరిశీలిస్తున్న ఆర్‌డీఓ శేషశైలజ

బాడంగి: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని బొబ్బిలి ఆర్‌డీఓ పి.శేషశైలజ మంగళవారం పరిశీలించారు. ఈ నెల 13వ తేదీన జరిగే పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఒక బ్యాలెట్ బాక్సు కన్నా రెండు బ్యాలెట్ బాక్సులు ఏర్పాటు చేస్తే, పోలింగ్‌ను త్వరితగతం చేయవచ్చని సూచించారు. అనంతరం పాఠశాల విద్యార్థుల కోసం చేసిన మధ్యాహ్న భోజనం వంటకాలను రుచి చూసి పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు వంటకాలు వండిపెట్టాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాలమురళీకృష్ణ, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



రేగిడి: వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు



సంతకవిటి: వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో ఆర్గానిక్ వంటకాలను రుచి చూస్తున్న తహసీల్దార్ సులోచనరాణి



రాజాం: పెనుబాక పాఠశాలలో మహిళా టీచర్లను సన్మానిస్తున్న దృశ్యం



బాడంగి: ఉపాధ్యాయినిని సన్మానిస్తున్న ప్రధానోపాధ్యాయుడు త్రినాధరావు

బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లోని ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులంతా అన్ని రంగాల్లో మహిళలు పురుషులతో సమానంగా రాణించాలని, ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని, ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలుచోట్ల చేపట్టిన క్రీడాపోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. మరికొన్నిచోట్ల ఉన్నత స్థానాల్లో స్థిరపడిన వారిని సన్మానించి, వారిని ఆదర్శంగా తీసుకోవాలని వక్తలు కోరారు.

–సాక్షి నెట్‌వర్క్

ఆడదూడల అభివృద్ధికి కృషి

- జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఈఓ దామోదరరావు



మాట్లాడుతున్న జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఈఓ దామోదరరావు

బొబ్బిలి రూరల్: రాష్ట్రీయ గోకుల్ మిషన్ సౌజన్యంతో ఆడదూడల అభివృద్ధికి కృషి చేస్తున్నామని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఈఓ ఎం.దామోదరరావు తెలిపారు. మంగళవారం స్థానిక పశువైద్య కేంద్రంలో విలేకరులతో మాట్లాడిన ఆయన లింగ నిర్ధారిత వీర్యం ద్వారా 90 శాతం ఫలితం ఉంటుందన్నారు. రూ.1350 ఇంజెక్షన్‌ను రైతులకు రూ.500కే అందిస్తున్నామన్నారు. ఫలితం లేకుంటే డబ్బులు వాపసు కూడా ఇస్తామన్నారు. జిల్లాలో ఇంతవరకు 2,980 ఇంజెక్షన్లు తెప్పించామని, 550 పశువులకు వాటిని ఉపయోగించామన్నారు. ఈ పథకం కింద గోపాలమిత్రలకు రూ.550 ప్రోత్సాహకం అందిస్తున్నామన్నారు.

సంక్షిప్తంగా..

రుచి, శుచితో మధ్యాహ్న భోజనం



మధ్యాహ్న భోజనం రుచి చూస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ

తెర్లాం: రుచి, శుచితో కూడిన మధ్యాహ్న భోజనం విద్యార్థులకు అందించాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ, ఎంఈఓ త్రినాధరావు సూచించారు. మంగళవారం స్థానిక హైస్కూల్, ఆర్.గదబవలస గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించిన వారు జగనన్న గోరుముద్ద పథకం కింద అక్కడి విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం వంటకాలు విద్యార్థులకు వండిపెట్టాలని నిర్వాహకులకు సూచించారు.

దాడితల్లి ఆలయంలో పండగ వారాల పూజలు



పూజలందుకుంటున్న దాడితల్లి అమ్మవారు

బొబ్బిలి: పట్టణంలోని గొల్లపల్లిలో ఉన్న దాడితల్లి ఆలయంలో పండగ వారాల పూజలు మంగళవారం ప్రారంభమయ్యాయి. అమ్మవారి ఘటాల స్థాపన, శ్రీచక్రార్చన, విశేషార్చనలు నిర్వహించారు. మే 2వ తేదీన అమ్మవారి పండగ సందర్భంగా ప్రతీ వారం ఇలా పూజలు చేస్తామని, ఏప్రిల్ 15వ తేదీన అమ్మవారికి విశేషాభిషేకాలు నిర్వహిస్తామని ఆలయ అర్చకులు పిండిప్రోలు మణికుమార్ శర్మ తెలిపారు.

గంగమ్మ జాతర ప్రారంభం

మెంటాడ: మండలంలోని ఆంద్ర గ్రామంలో గంగమ్మ జాతర, జక్కువ గ్రామంలో సుందరమ్మ పేరంటాలు జాతర మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవార్ల దర్శనానికి భక్తులు పోటెత్తారు. పసుపు, కుంకుమ, చీరలు, గాజులతో పూజలు చేసి, భక్తిశ్రద్ధలు చాటుకున్నారు.

పైడితల్లి ఘటాల ఊరేగింపు



పైడితల్లి ఘటాలకు పూజలు చేస్తున్న మహిళలు

తెర్లాం: పైడితల్లి పండగలో భాగంగా మండలంలోని గంగన్నపాడు గ్రామంలో అమ్మవారి ఘటాల ఊరేగింపు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతీ వీధిలోని భక్తులు ఘటాలకు ప్రత్యేక పూజలు చేసి, తమ మొక్కులు చెల్లించుకున్నారు.

హేమాలమ్మకు ప్రత్యేక పూజలు

తెర్లాం: మండల కేంద్రంలో చిన్నమ్మ వారైన హేమాలమ్మకు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయాన్నే ఆలయానికి పోటెత్తిన భక్తులు పసుపు, కుంకుమ సమర్పించి, పూజించారు.

పోలిపల్లి పైడితల్లి మారు జాతర



పూజలందుకున్న పైడితల్లి

రాజాం సిటీ: స్థానిక బొబ్బిలి రోడ్డులో పోలిపల్లి పైడితల్లి మారు జాతర ఘనంగా నిర్వహించారు. గత వారం అమ్మవారి జాతర జరగగా, సంప్రదాయంగా మంగళవారం మారు జాతర చేపట్టారు. ఉదయం నుంచే భక్తులు అమ్మ వారి ఆలయానికి చేరుకుని, ప్రత్యేక పూజలు చేశారు.

వైభవంగా పరదేశమ్మ పండగ



పరదేశమ్మ దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు

బాడంగి: మండల కేంద్రంలో పరదేశమ్మ, పోలమాంబ అమ్మవార్ల పండగ మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే అమ్మవార్ల గద్దె దగ్గరకు చేరుకున్న భక్తులు అక్కడి అమ్మవార్ల ఘటాలకు ప్రత్యేక పూజలు చేశారు. పసుపు, కుంకుమ, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పండగలో భాగంగా చేపట్టిన డొంగురు మేళం, చోడవరం డప్పులు, తప్పిటగుళ్ల ప్రదర్శనలు, బిందెల డ్యాన్సు, కోలాటం చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

ఆలయ వార్షికోత్సవం

బొబ్బిలి రూరల్: మండలంలోని సీతయ్యపేట గ్రామంలో కమలవాసిని ఆలయ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారిని గ్రామ వీధుల్లో ఊరేగించి, కుంకుమ పూజలు, అభిషేకాలు చేశారు. సాయంత్రం చేసిన కోలాటం, సాముగరిడీల ప్రదర్శన ఆకట్టుకుంది.

గుళ్లసీతారాంపురంలో డోలాయాత్ర



పూజలందుకున్న సీతారాములు

సంతకవిటి: మండలంలోని గుళ్లసీతారాంపురం గ్రామంలో సీతారాముల ఆలయ డోలాయాత్ర మంగళవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా అర్చకులు ప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో సీతారాముల విగ్రహాలకు భక్తులు పూజలు చేశారు. బుధవారం పల్లకీసేవ, మండప దర్శనాలు నిర్వహిస్తామని సర్పంచ్ రావు రవీంద్ర తెలిపారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోండి

బొబ్బిలి: తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలని పబ్లిక్ హెల్త్ ఎస్ఈ కె.రాజారావు సూచించారు. మండలంలోని భోజరాజపురంలో ఉన్న మున్సిపల్ హెడ్ వాటర్ వర్క్సును మంగళవారం పరిశీలించిన ఆయన వేసవిలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని కోరారు.

రోజుకు రూ.257 వేతనం

తెర్లాం: మండల కేంద్రంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ మంగళవారం పరిశీలించారు. నిర్దేశించిన కొలతల్లో నాణ్యతా ప్రమాణాల మేర పనులు చేస్తే రోజుకు రూ.257 గిట్టుబాటు వేతనం లభిస్తుందని తెలిపారు. రోజూ రెండు పూటలా పనిచేయాలని, వేసవి నేపథ్యంలో పని ప్రదేశంలో టెంట్లు, తాగునీరు అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

సంతకవిటి: మండలంలోని తాలాడ గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఏపీఓ త్రినాధరావు మంగళవారం పరిశీలించి, వేతనదారులకు పలు సూచనలు చేశారు. రెండుపూటలా పని చేయాలని, నిర్దేశించిన కొలతల్లో నాణ్యతా ప్రమాణాల మేర పనులు చేయాలని తెలిపారు.

నేడు న్యాయ అవగాహన సదస్సు

రాజాం సిటీ: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో న్యాయ అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించనున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు ఓ ప్రకటనలో మంగళవారం వెల్లడించారు. ఈ సదస్సులో మహిళల హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించనున్నామని తెలిపారు.

పైడితల్లి సంబరాలు



అంజలి రథం ఊరేగిస్తున్న దృశ్యం

బొబ్బిలి రూరల్: మండలంలోని వాకాడవలస గ్రామంలో పైడితల్లి సంబరాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారి ఘటాలకు ప్రత్యేక పూజలు చేసి, సాయంత్రం అంజలి రథం ఊరేగించారు. ఈ సందర్భంగా చేపట్టిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి.

9న ఉచిత నేత్ర వైద్య శిబిరం

బాడంగి: స్థానిక శివాలయం వద్ద ఉన్న ఎంపీపీ స్కూల్ దగ్గర గురువారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు విశాఖకు చెందిన శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి నిర్వాహకులు వెంకటరమణ ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సాగే ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నేత్ర శస్త్రచికిత్స అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేస్తామని తెలిపారు.

పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కమిటీ ఏర్పాటు

రేగిడి: స్థానిక చర్చిలో మండల పాస్టర్స్ ఫెలోషిప్ కమిటీ ఏర్పాటు మంగళవారం జరిగింది. ఏకగ్రీవమైన ఈ ఎన్నికలో కమిటీ ప్రెసిడెంట్‌గా జయరాజు, వైస్ ప్రెసిడెంట్‌లుగా సునీల్‌కుమార్, అనీల్‌కుమార్‌లు, జాయింట్ సెక్రటరీగా రాజా, ట్రెజరర్‌గా పీకే రాజు, సలహాదారులుగా నారాయణపాల్, ఏసురత్నం ఎన్నికైనట్లు దైవజనులు ఇస్సాక్, జాకోబ్, నాయుడు, క్రీస్తుదాసు తెలిపారు.